ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రిజిస్ట్రేషన్లు మందగమనం

గతేడాది కంటే తగ్గుముఖం - కొత్త ప్రాజెక్టులపై తొలగని అస్పష్టత



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూముల క్రయవిక్రయాలు మందగించాయి. రాజధాని ప్రాంతంలో భూ యజమానులు భారీగా ధరలు పెంచడంతో 29 గ్రామాల పరిధిలో రిజిస్ట్రేషన్లు గత ఆరు నెలలుగా పూర్తిగా తగ్గిపోయాయి. రాజధానికి అనుబంధంగా ఔటర్ రింగు రోడ్డు, అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాదు- విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, అమరావతికి రైల్వేలైను, అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి ఏ ప్రాంతంలో ప్రభుత్వం భూములు తీసుకుంటుందో స్పష్టత లేకపోవడంతో క్రయ, విక్రయదారుల్లో అయోమయం నెలకొంది. రాజధాని విస్తరణ పేరుతో మరో 44 వేల ఎకరాల భూమిని సమీకరణ ద్వారా ప్రభుత్వం రైతుల నుంచి తీసుకుంటుందనే ప్రచారంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో క్రయ విక్రయాలు కొన్ని నెలలుగా సగానికి పైగా తగ్గాయని అధికార వర్గాలు తెలిపాయి. రాజధాని పరిధిలోని మందడం, తుళ్లూరు, ఆనంతవరం సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో రోజుకు రెండు నుంచి నాలుగు లోపు జరుగుతున్నాయి. అయితే వీటితో పాటు రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు సిఆర్‌డిఎ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లుకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు కొన్ని చేస్తున్నారు. మిగతా అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో 2024-25లో జరిగిన రిజిస్ట్రేషన్ల కంటే గత ఆరు నెలల కాలంలో తగ్గాయి. గతేడాది కూడా రాజధాని అమరావతి గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తక్కువగా నమోదు కాగా ఇతర ప్రాంతాల్లో కొనుగోళ్లు పెరిగాయి. గుంటూరు జిల్లాలోని 18 మండలాల్లో తగ్గాయి.

తాజాగా రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకోవడంతో పాటు రెండు జిల్లాల పరిధిలోకి పలు ప్రాంతాల్లో కొన్ని ప్రాజెక్టులు వస్తున్నాయన్న సమాచారంతో ఏయే ప్రాంతాల్లో ఏ ప్రాజెక్టుకు ప్రభుత్వం భూములు ఎంత వరకు తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఎవరికి వారు ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు. 24 గ్రామాలల్లో 44 వేల ఎకరాల సమీకరణ ఉంటుందని తొలుత ప్రకటించినా కొన్ని గ్రామాల రైతుల్లో విముఖత వ్యక్తం కావడం, తొలి విడత భూ సమీకరణలో భూములిచ్చిన వారికి రిటర్నుబుల్ ప్లాట్లు ఇచ్చిన తరువాతే మలి విడత సమీకరణ చేయాలని టిడిపి కూటమి నాయకుల నుంచే వత్తిడి రావడంతో ప్రస్తుతం ఈ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. దీంతో సాధారణంగా జరగాల్సిన క్రయ విక్రయాలు కూడా మందగించాయి. ఇదే సమయంలో పలు గ్రామాల్లో అనధికార లే అవుట్లు వెలిశాయి. రాజధాని బయట భారీగా వ్యాపారం జరిగితే తమ పరిస్థితి ఏమిటని సిఆర్‌డిఎ అధికారులపై రాజధాని రైతులు వత్తిడి తేవడంతో పలు గ్రామాల్లో అధికారులు ఇటీవల అనధికార లే అవుట్లను కూల్చివేశారు. మారిన పరిస్థితులో మళ్లీ అధికార లే అవుట్లు వెలుస్తున్నాయి. మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, పెదకాకాని, గుంటూరు రూరల్, తెనాలి, దుగ్గిరాల, పొన్నూరు, చేబ్రోలులో ప్రస్తుతం లావాదేవీలు స్వల్పంగా జరుగుతున్నాయి. పల్నాడు జిల్లాలో అమరావతి, క్రోసురూ, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, మడ్లపాడు, నాదెండ్ల, వినుకొండ, శ్యావల్యాపురం తదితర ప్రాంతాల్లో గతేడాది కంటే ఈ ఏడాది మందగించాయి.



పనిగంటల పెంపుపై నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పని గంటలు పెంచుతూ టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు నరసరావుపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, రైతుసంఘం, కౌలురైతు సంఘాల జిల్లా కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించి ఎక్కువ సమయం పని చేయించుకుని శ్రమ దోపిడీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోందన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్‌లకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కార్మికులను యజమానులకు కట్టుబానిసలుగా మార్చే 13 గంటల పని దినం బిల్లును ఉపసంహరించుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. పనిగంటల పెంపువల్ల కార్మికుల జీవన ప్రమాణం తగ్గిపోవడంతో పాటు కొంతమంది కార్మికులకు పని దొరకక నిరుద్యోగం పెరుగుతుందన్నారు. పని దినాన్ని 6 గంటలకు తగ్గించాలని అనేక చోట్ల పోరాటాలు జరుగుతుంటే దీనికి భిన్నంగా 13 గంటలకు పెంచడం ఎవరి ప్రయోజనాల కోసమో కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మహిళలకు పట్ట పగలే రక్షణ లేదని, అటువంటి పరిస్థితుల్లో రాత్రి సమయంలో పని చేయాలనే నిబంధన ఎలా పొందుపరిచారని నిలదీశారు. మహిళలపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఏ రకంగా రాత్రి వేళల్లో పని చేయగలుగుతారని ప్రశ్నించారు. మోడీ అనుసరిస్తున్న కార్పొరేట్ ▶ 2లో

'అన్నపర్రు' ఘటనలు పునరావృతం కానివ్వొద్దు

- ఆరోగ్యం పూర్తి మెరుగ్గా ఉంటనే విద్యార్థుల డిశ్చార్జి
- ఇళ్లకెళ్తామన్నవారిని తల్లిదండ్రులను పిలిచి పంపించండి
- అధికారులతో మంత్రి సవిత టెలికాన్ఫరెన్స్

- 2 లో



శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి- కారంపూడి : పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద రైతులు శనివారం ధర్నా చేశారు. కారంపూడి మండలం ఇనపరాజుపల్లి గ్రామానికి చెందిన రైతులు మహిళలు భారీగా సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని వంటావార్పు ద్వారా నిరసన తెలిపారు. తమ భూములు తీసుకుని తమ పిల్లలకు ఇంత వరకు ఉద్యోగాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో స్థానికులకు కాకుండా స్థానికేతరులకు ఉద్యోగాలిస్తున్నారని, సమస్యపై నెల రోజుల క్రితం ఆందోళన చేస్తే 15 రోజుల్లో సమస్య పరిష్కారిస్తామని హామీనిచ్చినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని విమర్శించారు. భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పాటుపడతాం

- ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి
- యుటిఎఫ్ పల్నాడు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం యుటిఎఫ్ లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నరసరావుపేటలో శనివారం యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రారంభ సూచికగా ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని యుటిఎఫ్ పల్నాడు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి, యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఎ.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు గత వేసవి సెలవుల్లో యుటిఎఫ్ విస్తృతంగా కృషి చేసిందని, అవసరమైతే ఉపాధ్యాయులుగా అదనంగా పని చేసి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పాటుపడతామని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ అగ్రభాగాన ఉండి పోరాడిందన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయుల సమస్యలు, విద్యా వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డిఏలలో 2 డిఏలను తక్షణమే విడుదల చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. పిఆర్‌సి కమిషన్ నియమించాలని, మెమో 57 అమలు, 2003 డిఎస్‌సి అభ్యర్థులకు ఒపిఎస్ అమలును డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలన్నారు. ఐదేళ్ల కాలానికి ప్రపంచ బ్యాంక్‌తో ఆంధ్ర సపోర్టింగ్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ ఒప్పందం 2021లో చేసుకుని రూ.1860 కోట్ల అప్పు తీసుకున్నారన్నారని, ఈ పథకం ద్వారా విద్యార్థులను అంతర్జాతీయ విద్యార్థిగా తయారు చేయడం, నాణ్యమైన విద్య అందించడం కాగా, ఆ లక్ష్యాన్ని నీరుగారుస్తూ ఆన్లైన్‌లో సమాచారాన్ని పంపించే పాఠశాలలుగా మార్చారని విమర్శించారు. విద్యకు బడ్జెట్లో కోత విధించడంతో, విద్యార్థుల సంఖ్య, పాఠశాలల సంఖ్య తగ్గి విద్యార్థుల సామర్థ్యాలు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, మానసిక ఒత్తిడి లేకుండా ▶ 2లో

కొట్టడం వల్లే విద్యార్థిని మృతి?

పోస్టుమార్టం నివేదికతో కేసు కొత్తమలుపు - 2 లో

జాబ్‌చార్ట్ ప్రకారమే విధులు

- సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం
- సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ మహాసభలో జెఎసి నాయకులు

ప్రజాశక్తి - తెనాలి

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని రాష్ట్ర జేఏసీ చైర్మన్ జి.జోసెఫ్ కిషోర్ అన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభను శనివారం స్థానిక ఓ హోటల్లో జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త బి.సతీష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జోసఫ్ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షా ముప్పై నాలుగు వేలమంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ అర్హతతో ఉద్యోగాలు కల్పించిన వారికి జూనియర్ అసిస్టెంట్ ▶ 2లో



మాట్లాడుతున్న జోసెఫ్ కిషోర్, సతీష్

కొట్టడం వల్లే విద్యార్థిని మృతి?

పోస్టుమార్టం నివేదికతో కేసు కొత్తమలుపు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రమైన దుగ్గిరాలలోని జెడ్పి పాఠశాల 9వ తరగతి విద్యార్థిని నాలుగు నెలల కిందట మరణించగా ఆ కేసు కొత్త మలుపు తిరిగింది. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదైన తాజాగా వచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో మాత్రం... మృతురాలి ప్యాంక్రియాస్ గ్రంథిపై గాయాలున్నాయని, కొట్టడం వల్లే చనిపోయి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో మృతురాలి కుటుంబీకులను పోలీసులు విచారణ చేస్తున్నారు. దుగ్గిరాల ఎస్సీ కాలనీకి చెందిన కొక్కిలగడ్డ అమూల్య తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందటే విడిపోయారు. తల్లి తెనాలి మండలం కొలకలూరులో నివాసం ఉంటున్నారు. పిల్లలు మాత్రం దుగ్గిరాలలోనే తండ్రి, తాతయ్య వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో అమూల్యకు వాంతులు కావడంతో తెనాలి ఆస్పత్రికి తరలించబోయామని, మధ్యలోనే మృతి చెందిందని అప్పట్లో కుటుంబీకులు చెప్పారు. అయితే తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని తల్లి ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి తెనాలి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

అధునాతన వసతులతో రైతు బజార్ నిర్మాణం

ప్రజాశక్తి-గుంటూరు

నగర ప్రజల సౌకర్యార్థం బందావన్ గార్డెన్స్ కుందుల రోడ్డులో అధునాతన వసతులతో కూడిన రైతుబజార్ నిర్మాణం జరగనున్నదని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం మార్కెటింగ్ శాఖ, జిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి కుందుల రోడ్డులోని రైతు బజార్‌ని పరిశీలించారు. రైతుబజార్ నిర్మాణానికి జిఎంసి స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, నిర్మాణానికి ఇప్పటికే మార్కెటింగ్ శాఖ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతుబజార్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. నిర్మించబోయే రైతు బజార్‌ని ఆధునిక వసతులతో సెల్లార్ పార్కింగ్‌తో కూడి 2 అంతస్తులు ఉండేలా విశాలంగా షాప్‌లు ఉండేలా నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నిర్మాణం ప్రాంతంలో జిఎంసి స్థలం సర్వే సమగ్రంగా చేపట్టి, ఆక్రమణలు గుర్తిస్తే చట్టప్రకారం తొలగించాలన్నారు. రైతు బజార్ వెలుపల రోడ్డుపై ట్రాఫిక్‌కి అవరోధంగా ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఏసిపి రెహ్మాన్, మార్కెటింగ్ శాఖ ఏడి సత్యనారాయణచౌదరి, కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్ ఇతర అధికారులు సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ల లీకులకు మరమ్మతులు చేపట్టాలి

తాగునీటి పైపులైన్లకు లీకులేర్పడితే వెంటనే మరమ్మతు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. బ్రాడీపేట, శంకర్‌విలాస్ ఆర్వోబీ, డొంకరోడ్డు, శ్రీనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి తాగునీటి పైపులైన్లు, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. బ్రాడీపేటలో తాగునీటి పైపులైన్ లీకును గమనించి, వెంటనే మరమ్మతులకు ఆదేశించారు. ఎక్కడైనా సైడు కాల్వల్లో తాగునీటి పైపులుంటే వాటిని తొలగించాలన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి, పిల్లర్స్ నిర్మాణం కోసం తవ్విన మట్టిని ప్రజలకు ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, సర్వీస్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బంది లేకుండా మట్టిని తొలగించాలని ఆదేశించారు.

నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి నగర పరిధిలో 7వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలను మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ శనివారం ప్రారంభించారు. యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై తమ ప్రతిభను ప్రదర్శించాలని, ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతులు కల్పిస్తోందని కిరణ్‌చంద్ అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'అన్నపర్రు' ఘటనలు పునరావృతం కానివ్వొద్దు

- ఆరోగ్యం పూర్తి మెరుగ్గా ఉంటనే విద్యార్థుల డిశ్చార్జి
- ఇళ్లకెళ్తామన్నవారిని తల్లిదండ్రులను పిలిచి పంపించండి
- అధికారులతో మంత్రి సవిత టెలికాన్ఫరెన్స్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అనపర్రు లాంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దని అధికారులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. జిల్లా అధికారులతో తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి మంత్రి శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థు ఆరోగ్య పరిస్థితి గురించి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్ ఎస్.వి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. 60 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రికి చేరగా, ప్రస్తుతం 24 మంది మాత్రమే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థి ఐసియులో చికిత్స అందజేస్తున్నామని రమణ తెలిపారు. ఆ విద్యార్థి ఇంతకుముందు నుంచే కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో ఐసియులో వైద్యమందిస్తున్నామని చెప్పారు. మరో ఇద్దరు విద్యార్థులు పెదనందిపాడు కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామని వివరించారు. మంత్రి సవిత స్పందిస్తూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తరవాతే డిశ్చార్జి చేయాలన్నారు. వారి ఆరోగ్యంపై గంటకు గంటకూ అప్‌డేట్ ఇవ్వాలని, ఐసియులో చికిత్స పొందుతున్న విద్యార్థిని తక్షణమే ఎయిమ్స్‌కు తరలించాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లాని చెప్పారు. ఇళ్లకు వెళ్లదలుచుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులను పిలిచి వారితో పంపించాలన్నారు. సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు వినాలన్నారు. హాస్టళ్లలో వార్డెన్లు ఉండేలా చూడాలని, బయట ఆహారం హాస్టళ్లోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచుతాం : మంత్రి అచ్చెన్నాయుడు



రైతులను సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పప్పుదినుసుల ఉత్పత్తులను పెంచడానికి కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. లాంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పిఎం ధన్, ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత మిషన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో 100 జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతులకు కేంద్ర ప్రభుత్వం 30 పథకాల ద్వారా ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. పంటల వైవిధ్యంతో రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యమని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పత్తుల పెంపు, నాణ్యతపై దృష్టి, పంట అనంతరం నష్టాలు తగ్గించడం ప్రధాన లక్ష్యంగా వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తారు చెప్పారు. పప్పు ధాన్యాల ఉత్పత్తి-ఉత్పాదక పెంచటంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. పప్పు ధాన్యాలను చివరి గింజ వరకు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఒకే విధమైన పంటలను సాగు చేయకుండా ప్రకృతి సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. విదేశాలకు ఎగుమతులకు వీలుగా పంట ఉత్పత్తుల్లో నాణ్యతను పెంపొందించే సాగు విధానాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి, పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి ఎస్.ఢిల్లీ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఏ.పీ సీడ్స్ డైరెక్టర్ సతీష్, ఫిషరీస్ కమిషనర్ రవి శంకర్‌నాయక్ పాల్గొన్నారు. పప్పు దినుసుల ఉత్పత్తుల్లో మెరుగైన ఫలితాలు సాధించిన వారిని, అభ్యుదయ రైతులను సన్మానించారు. రైతులకు విత్తనాలు సరఫరా చేశారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభం



ప్రజాశక్తి - తెనాలి

అమృత్ 1.0 పథకం కింద స్థానిక 11వ వార్డులో నిర్మితమైన 10 ఎంఎల్డీ మురుగు నీటి శుద్ధి ప్లాంటును రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్లాంట్‌ను మంజూరు చేయించారని, ఇప్పుడు మంత్రి మనోహర్ హయాంలో పూర్తయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెనాలి మంగళగిరి రోడ్డు, రైల్వే స్టేషన్ అభివృద్ధి చేశామన్నారు. ఈ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్ స్థలం నిరుపయోగంగా ఉందని స్థానికులు తన దృష్టికి తెచ్చారని, దానిపైనా చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా పారిశుధ్య సౌకర్యాలు ఒక ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలనేదే కూటమి ప్రభుత్వం విధానమన్నారు. టిడిపి ప్రారంభించిన పనులను ఆపాలన్న ఉద్దేశంతోనే టిడ్కో ఇళ్లను గత వైసిపి ప్రభుత్వం మూలాన పడేసిందన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ 11వ వార్డులో ఉన్నప్పటికీ, అన్ని వార్డుల నుంచి వస్తున్న వేస్ట్ వాటర్ ఇక్కడ శుద్ధి చేయబడుతుందన్నారు. సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు నిర్వహణను ప్రజలందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మురుగునీటి శుద్ధి ప్లాంటును అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, కౌన్సిలర్ కె.రత్నకుమారి, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

వివిఐటియు విద్యార్థులకు ఉద్యోగాలు



ప్రజాశక్తి - పెదకాకాని : నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీకి చెందిన 109 మంది విద్యార్థులు కాగ్నిజెంట్ (డిజిటల్ నర్చర్), డెల్టా ఎక్స్, ఫ్లిస్ట్ ల్యాబ్స్, జెన్ ట్రీ ట్యాబ్స్, టెక్ అవుట్ సొల్యూషన్స్, ఈఫిల్ టెక్ సొల్యూషన్స్, పాలెక్, సెర్వాడ్ తదితర బహుళజాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు వివిఐటియు వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ శనివారం తెలిపారు. యూనివర్శిటీలో ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పాల్గొన్న 2022-2026 బ్యాచ్ విద్యార్థులు ఈ నియామకాలు పొందారని తెలిపారు. వీరికి రూ.3 నుండి 8 లక్షల వార్షిక వేతనం వస్తుందన్నారు. మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ వంటి కోర్ బ్రాంచిలకు చెందిన విద్యార్థులు అత్యధికంగా 75 మంది ఈఫిల్ టెక్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు. వీరిని చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలిరాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ప్లేస్మెంట్ డైరెక్టర్ ఎ.వెంకటేష్, ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ యు.మాధవయ్య అభినందించారు.

పనిగంటల పెంపుపై నిరసన

(మొదటి పేజీ తరువాయి)

అనుకూల విధానాలను సమర్థిస్తూ కార్మిక వర్గానికి ద్రోహం చేయడం తగదన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చు చేసి కార్మికులను బానిసలుగా చేసేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, నాయకులు షేక్ సిలార్ మసూద్, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు రబ్బాని, సుభాష్ చంద్రబోస్, ఎం.రాంబాబు, బి.బాలకోటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పాటుపడతాం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు పని చేయడం కోసం సొల్లు పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎన్ మల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు, గౌరవాధ్యక్షులు షేక్.కాసింపీరా, సహాధ్యక్షులు జెవిడి నాయక్, ఎ.బాగేశ్వరిదేవి, కోశాధికారి ఎం.రవిబాబు, ఇతర బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష మోడల్ బుక్లెట్ ఆవిష్కరణ

8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్‌కు సంబంధించిన మెంటల్ ఎబిలిటీ టెస్ట్ మెటీరియల్‌ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తంగా ప్రచురించగా దీన్ని ఎన్.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ మెటీరియల్‌ను విద్యార్థులు ఉపయోగించుకుని స్కాలర్‌షిప్ సాధించాలని సూచించారు.

జాబ్‌చార్ట్ ప్రకారమే విధులు

(మొదటి పేజీ తరువాయి)

స్కేల్ ఇవ్వాల్సి ఉండగా, రికార్డ్ అసిస్టెంట్ స్కేల్‌తో సరిపెట్టారన్నారు. వ్యత్యాసాన్ని గమనించి ఆరేళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకొని సీనియర్ అసిస్టెంట్ స్కేల్ వర్తింపచేయాలని కోరారు. ఉద్యోగుల బదిలీలకు ఐదేళ్ల నిబంధనను కచ్చితంగా పాటిస్తున్న ప్రభుత్వం, ఆరేళ్ళ పూర్తయినా ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ఎందుకు వర్తింప చేయటంలేదని ప్రశ్నించారు. ప్రొబేషన్ డిక్లరేషన్ 9 నెలలు ఆలస్యంగా జరిపిన ప్రభుత్వం, ఆ బకాయిలు నేటికీ చెల్లించలేదన్నారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల విషయంలోనూ తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సొంత మండలాల్లో పనిచేసే అవకాశం లేదనే కండిషన్ పెట్టారని, దానిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్, డిజేబుల్ ఉద్యోగుల కోసం విడుదల చేసిన జీవోలు అమలు కావడం లేదన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సతీష్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలపై కమిటీలతో ప్రభుత్వం కాలయాపన చేయటం, వాలంటీర్ల విధులను సచివాలయ ఉద్యోగులకు ఆపాదించడం సరికాదన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు జి.కిరణ్ కుమార్, ఎ.కిషోర్, డి.దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

ఎస్‌జిటిలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ

ఎస్‌ఎలు, పిజిటి, టిజిటిలకు నేడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డిఎస్‌సి ద్వారా ఎంపిక అయిన నూతన ఉపాధ్యాయులకు పాఠశాలలో పోస్టింగ్‌లు ఇస్తూ ఆన్‌లైన్‌లో ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియ శనివారం ప్రారంభం అయింది. ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాత్రమే పోస్టింగ్ అర్డర్లు వారి మెయిల్, మొబైల్‌కు అందాయి. ఎస్‌జిటిలకు మాన్యువల్‌గా ఆప్షన్లు తీసుకోగా టిజిటి, పిజిటి, స్కూలు అసిస్టెంట్ కేటగిరిల్లోని ఉపాధ్యాయులకు వెబ్ ఆప్షన్‌ల నమోదు చేశారు. అయితే టిజిటి, పిజిటి, స్కూలు అసిస్టెంట్ కేటగిరిల్లోని ఉపాధ్యాయులకు ఇంకా పోస్టింగ్ ఉత్తర్వులు రాలేదని తెలిసింది. ఆదివారం సాయంత్రం లోగా నూతన ఉపాధ్యాయులందరికీ వారికి పాఠశాలల కేటాయింపుతో కూడిన ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో అందరికి వస్తాయని సోమవారం సంబంధిత పాఠశాలకు వెళ్లి విధుల్లో చేరవచ్చునని అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న దుర్గారావు

పాఠశాల పారిశుధ్య కార్మికులకు తక్కువ వేతనాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించకపోవడమే కాకుండా సకాలంలో ఇవ్వకపోవడం అన్యాయమని తాడేపల్లి మండల పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షుడు వేముల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశా రు. శనివారం ప్రకాష్‌నగర్ సిఐటియు ఆఫీసులో వి.మరియమ్మ అధ్యక్షతన తాడేపల్లి మండల శానిటేషన్ కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ కార్మికులకు కేవలం ఇస్తున్నది రూ.6వేలు మాత్రమేనని, అదీ సకాలంలో చెల్లించకపోవడం దారుణమని మండిపడ్డారు. కనీసం రూ.10వేలు జీతం ఇవ్వాలని, ప్రతినెల చెల్లించాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు తాడేపల్లి మండల అధ్యక్షురాలుగా వి.మరియమ్మ, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి మేరీ ప్రమీల, కోశాధికారిగా డి ప్రసన్నను వీరితోపాటు మరో 9 మందిని కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈనెల 15వ తారీఖు నాడు సంబంధిత అధికారులకు జీతాలు పెంచాలని అర్జీలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తెనాలి


ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు నందుల పేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వి. ప్రియాంక ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని పలు వసతి గృహాలలో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి సూచనల మేరకు నాజర్ పేటలోని ఎస్సీ బాలుర వసతి గృహం, సంకావారివీధిలోని బిసి బాలుర వసతి గృహం, దేవి చౌక్ సోషల్ వెల్ఫేర్ కాలేజీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటగదుల శుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై డాక్టర్ ప్రియాంక పలు సూచనలు చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ తాడిబోయిన ఆదినారాయణ, పిడపర్తిచెంచయ్య, మరియదాసు, ఆరోగ్య సిబ్బంది ఎస్ ఉమాకాంత్, ఎ.బాలచంద్ర మౌళి, సిహెచ్ ప్రసన్న పుష్పలత, చెన్ను చంద్రమ్మ, కె. అక్కమ్మ టి నాగలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లించండి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - పెదకాకాని

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి పెదకాకాని మండలం తహశీల్దార్ కృష్ణకాంత్‌కు శనివారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు ఎనిమిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు పెంచకపోవడంతో కుటుంబాలు అర్ధాకలితో బతుకుతున్నారని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వీఆర్‌ఏలకు కనీస వేతనం ఇవ్వాలనీ, వీఆర్‌ఏలకు, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ ఖాళీ పోస్టుల్లో వీఆర్‌ఏలకు 70 శాతం కేటాయించాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలనే డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. వీఆర్‌ఏల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా తమ సమస్యలు పరిష్కరించలేదనీ, తెలంగాణ రాష్ట్రంలో మూడేళ్లుగా పే స్కేల్ జీతాలు చెల్లిస్తున్నారన్న విషయాన్ని కూడా మంత్రి దష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధించిన నైట్‌డ్యూటీలు రద్దు చేయాలని ఆందోళన బాట పట్టారన్నారు. ఈనెల 13, 14 తేదీలలో విజయవాడలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు, 15వ తేదీ జరిగే ధర్నాలకు వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సహాయకుల సంఘం మండల కార్యదర్శి సురేష్ ఫకీరయ్య మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు మెమొరాండం అందజేస్తున్న విఆర్‌ఏ నాయకులు

నిర్మల ఫార్మసీ కళాశాలలో 'అంతర్జాతీయ బాలికా దినోత్సవం'



ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్‌లోని జెండర్ ఈక్వాలిటీ క్లబ్, డిస్క్రిమినేషన్ టు ఎంపవర్మెంట్" అను థీమ్‌తో నిర్వహించారు. కార్యక్రమానికి ఆరంభంగా జెండర్ ఈక్వాలిటీ క్లబ్ విద్యార్థి సమన్వయకర్త ఎ. తనుశ్రీ స్వాగతం పలికారు. బాలికల హక్కులు, సమాన అవకాశాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి ప్రసంగిస్తూ "ప్రతి బాలికకు విద్య, గౌరవం, స్వేచ్ఛ అందే సమాజం నిర్మించడం మనందరి బాధ్యత అన్నారు. బాలిక ఒక కుటుంబానికి వెలుగుగా, సమాజానికి ఆధారస్తంభంగా నిలుస్తుందన్నారు. వివక్షను తొలగించి, ఆత్మవిశ్వాసం పెంచి, తమ ప్రతిభను చాటుకునే వేదికలను అందించడం ద్వారా మాత్రమే సత్యమైన సాధికారత సాధ్యమవుతుంది" అని చెప్పారు. బాలికలు తమని తాము తక్కువగా చేసుకొని ఆడపిల్లలుగా పుట్టినందుకు నిందించుకోకుండా, ఉత్సాహంగా జీవితంలో ఒక లక్ష్యంతో, విజయాలతో కొనసాగా లని కోరారు అన్నారు. ఆర్. రత్నమంజుల, వుమెన్ సెల్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ – "బాలికలు కేవలం రేపటి తల్లులు కాదు, నేటి నాయకులూ సమాజంలో అడ్డంకులను అధిగమించి తమ కలల దిశగా అడుగులు వేయాలన్నారు. విద్యార్థినులు తమ జీవితంలో ధైర్యం, నిబద్ధత, నైతికతను ప్రదర్శించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి" అని అన్నారు. కార్యక్రమంలో ఎం. భార్గవి ప్రియా తన ప్రసంగంతో అందరి ప్రశంసలు అందుకొని ప్రశంసాపత్రం పొందారు. మాస్టర్ రేఖా నిత్విక్ గౌతమ్ బాలికా దినోత్సవ థీమ్‌కు అనుగుణంగా కోట్స్, కవితలు, కబుర్లు చెబుతూ అందరి మన్ననలు పొందాడు. ప్రిన్సిపల్ డా. బి. పాముల రెడ్డి ఈ కార్యక్రమం లో పాల్గన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ార్యక్రమంలో డాక్టర్ రేఖా నరేష్ బాబు, ఎస్. స్వాతి డాక్టర్ ఎస్‌కే. ఫైజాన్ అలీ పాల్గొన్నారు.

దేశానికి గ్రామాలు పట్టుగొమ్మలు : కేంద్రమంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి - కొల్లిపర

గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలాంటివన్నీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం కొలిపర మండల పరిధిలోని చక్రాయ పాలెంలో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాలును పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ప్రారంభించారు అనంతరం అత్తోట గ్రామంలో నిర్మించనున్న కళ్యాణ మండపానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వా గెలుపునకు కారణమైన మీ అందరి నడుమ అభివృద్ధి పనులకు భాగస్వామ్యం కావటం ఆనందంగా ఉందన్నారు. అత్తోట గ్రామంలో నిర్మించనున్న కళ్యాణ మండపానికి 30 సెంట్లు స్థలాన్ని ఉదారంగా అందజేసిన స్థలదాత అద్దంకి నాగరత్నంను సన్మానించారు. సభలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గుంటూరు హనుమాన్ పాలెం రోడ్డు డొంక రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి పనులకు స్వీకారం చుడుతోందనీ, దాతల ఔదార్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాది వెంకటేశ్వరరావు ఎంపీటీసీ హరికఅష్ణ చందు సాంబశివరావు ఇంచార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్యాణ్ మండపానికి 30 సెంట్లు ఇచ్చిన స్థలదాతను సన్మానిస్తున్న నాయకులు

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - మేడికొండూరు

దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రేతలు పోలీస్ అనుమతులు తప్పక తీసుకోవాలని మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ హెచ్చరించారు. అక్రమంగా బాణసంచా విక్రయాలు నిర్వహించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా నిల్వ, రవాణా, విక్రయాలకు నిర్దేశించిన భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అనుమతి లేకుండా బాణ సంచా విక్రయించినా, ప్రమాదకరంగా నిల్వ చేసిన కేసులు నమోదు చేస్తామన్నారు.

ఐక్యతకు ప్రతీక గ్యార్మీ పండుగ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరంలో ఐక్యత, సోదర భావానికి ప్రతీకగా నిలిచే మహబూబ్ సుభాని జెండా పండుగ (గార్మీ) ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం గాజులవారి వీధి జరిగిన ఈ వేడుకలకు మాధవి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేసి, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గ్యార్మీ పండుగ మన దేశంలోని మతసామరస్యానికి, ఐక్యతకు ప్రతీక. ముస్లిం సోదరులు ప్రతీ ఏటా భక్తి, ఉత్సాహంతో ఈ పండుగను నిర్వహిస్తారన్నారు.



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

రోడ్డును ముంచెత్తిన మురుగు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కృష్ణనగర్ పాత పంచాయతీ ఏరియాలోని గాంధీనగర్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగునీరు రోడ్డుపైకి చేరింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు చినుకులు వర్షం పడితే ఇక అంతే సంగతులు. మురుగునీరు రోడ్డును ఆక్రమించి ముంచెత్తటంతో విపరీతమైన దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని మురుగు సమస్యను పరిష్కరించాలని బాధత ప్రజలు కోరుతున్నారు.



క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

6 క్రస్ట్ గేట్లు ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతుండటంతో శనివారం 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 6గేట్లు 5 అడుగుల మేర ఎత్తి 48,600 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,00,729 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి మొత్తం ఔటీగా 1,00,729 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇక్కడ నుంచి కుడికాలువకు 10,040, ఎడమకాలువకు 7.353. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,536, ఎస్ఎల్‌బిసికి 1.2 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్థుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590,00 అడుగులు కాగా ఇది 312,0450 టీఎంసీలకు సమానం.



ప్రతిభ చూపిన విద్యార్థినులతో అధ్యాపకులు

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17, అండర్ 14 విభాగాల్లో విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. కబాడి, వాలీబాల్, షటిల్, అథ్లెటిక్స్‌లో విజయం సాధించారు. విజయం సాధించిన బాలికలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.మాధవిలత, వ్యాయామ ఉపాధ్యాయురాలు శివ గోవర్ధనలు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

గుంటూరు - హైదరాబాద్ మధ్య నడిచే పల్నాడు, రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెదకూరపాడు స్టేషన్లో హాల్ట్ ఇచ్చేలా ప్రయత్నించాలని కోరుతూ గ్రామస్తులు పల్నాడు ఎంపీ శ్రీ శ్రీకష్ణ దేవరాయలును శనివారం ఉదయం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది విజయవాడలో జరిగిన దక్షిణమధ్య రైల్వేజోనల్ సమావేశంలో జనరల్ మేనేజర్ ఒక్క ఎక్స్ ప్రెస్‌కైనా హాల్ట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ అమలు కాలేదు. ఈవిషయమై ఎంపీ దేవరాయలు మరోసారి స్పందించాలని సంబంధిత అధికారులతో మాట్లాడాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఎంపీ స్పందిస్తూ తప్పనిసరిగా మరోసారి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గుంటూరు డిజినల్ రైల్వే మేనేజర్‌కు కూడా వినతిపత్రాన్ని ఇవ్వమని సూచించారు. అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, క్రోసూరు మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు బెల్లంకొండ రామగోపాలరావు, జిల్లా టిడిపి కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, శ్రీనివాసరావు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్య క్షులు వడ్లమూడి అప్పారావు, సుధాకర్ పాల్గొన్నారు.

ఎంపి నిధుల కోసం సర్పంచ్ వినతి

పెదకూరపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బిసి, ముస్లిమ్, ఓసీ కాలానీల్లో డ్రెయినేజీల నిర్మాణానికి, విద్యుత్‌లైన్ల నిర్మాణానికి నిధుల కొరత ఉందని, ఎంపీ గ్రాంట్స్ నుండి మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు.

రోడ్లు చెరువుపాలు





బైపాస్ అప్రోచ్ రోడ్డు గుండా చెరువు నీరు పారుతున్న దృశ్యం, చెరువు నిండి రోడ్డుపై పారుతున్న నీరు

ప్రజాశక్తి - మాచర్ల

చెరువులో రోడ్డు వేస్తే ఏమౌవుతుందో.. అదే అయింది. మాచర్ల పట్టణ శివారులో దేవాలమ్మ చెరువు వుంది. దీనికి వెయ్యేళ్ళకు పైగా చరిత్ర ఉంది. దీనికి మహాదేవమ్మ చెరువని నామధేయం. ఆ పేరుతోనే మహాదేవిచెర్ల గ్రామం ఏర్పడి అది మాదేవిచెర్లగా మారి తరువాత మాచర్లగా రూపాంతరం చెందింది. అంతటి ఘన చరిత్ర ఉన్న ఈ చెరువు చాలా వరకు ఆక్రమణలకు లోనైంది. తాజాగా మాచర్ల బైపాస్ రోడ్డు కూడా ఈ చెరువు గుండానే వేశారు. బైపాస్ రోడ్డుతో పాటు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేశారు. ఈ బైపాస్ రోడ్డు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. బైపాస్ రోడ్డుకు ఒక వైపున చెరువు ఎక్కువ భాగం వున్నది. రెండవ వైపున చెరువు నిండినప్పుడు నీరు బయటకు వెళ్ళే అలుగు భాగం వున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి అప్రోచ్ రోడ్లపై నుండి నీరు పారుతుంది. అంతకు ముందు చెరువునిండి కట్టలపై నుండి అలుగుపారేది. ఇప్పుడా అవకాశం లేకపోవటంతో రోడ్లపై నుండి నీరు పారుతుంది. బైపాస్ రోడ్డు నిర్మించే సమయంలోనే ఈ సమస్యను ప్రజాశక్తి దినపత్రిక ఎత్తిచూపింది. ప్రస్తుతం చెరువునిండి నీరు రోడ్డుపై నుండి పారటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో పాటు పొలాల్లోకి నీరు చేరి ముంపుకు గురవుతన్నాయి గతమెప్పుడో చెరువు మధ్య భాగం నుండి సాగర్ రోడ్డు వేయటంతో చెరువు రెండు భాగాలైంది. ఆ తరువాత ఈ చెరువులోనే హాస్టళ్ళ, ఐసిడిసి కార్యాలయం, బస్‌డిపో నిర్మించారు. చెరువు నిండినప్పుడు వాటిల్లోకి నీరు చేరుతుంది. చెరువుపూడ్చి రోడ్లు ఎలా వేశారని మాచర్ల ప్రజలు మండి పడుతున్నారు. ఒక మారు పట్టణానికి మంచినీరు అందించే రిజర్వాయర్ ఖాళీ అయితే ఈ చెరువునీరే మాచర్ల వాసులకు దిక్కు అయిందని స్తానికులు గుర్తు చేస్తున్నారు. చెరువులన వలన భూగర్భజాలలు కూడా సంవృద్ధిగా వుండి బోర్లు పనిచేస్తున్నాయని, ఇలా చెరువును ఆక్రమించుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మిగిలిన చెరువు భాగంలో అడ్డంకులు అన్ని తొలగించి, నీరు ఎక్కువగా నీలిచేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పశుపక్షాదులకు ఈ చెరువు నీరు ఎంతో అవసరం అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారులకు అండగా వశిష్ట జూనియర్ కాలేజీ

అండర్-18 ఆసియా కబడ్డీ పోటీలకు ఎంపికైన హరీష్‌కు సన్మానం
అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా



హరీష్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్ ఎం.సురేష్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామీణ ప్రాంతాలలో ఎందరో యువత, విద్యార్థులు అనేక క్రీడలలో ప్రతిభ కలిగి ప్రోత్సాహం లేక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురాలేక పోతున్నారని అటువంటి వారికి వశిష్ట జూనియర్ కళాశాల అన్ని విధాలా అండగా ఉంటుందని డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ తెలిపారు. 18 జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికై భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్న ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం పాపన్నపాలెం గ్రామానికి చెందిన గద్దె హరీష్‌ను శనివారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో నరేష్ కుమార్ మాట్లాడుతూ త్వరలో బెహరాన్‌లో జరగనున్న అండర్-18 3వ ఆసియా కబడ్డీ పోటీలకు ఎంపికైన హరీష్‌లోని ప్రతిభను గుర్తించి తమ కళాశాల పిడి వై.సురేష్ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడంతో ఈ ఘనత సాధించారన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఆర్థికంగా వెనుక బడిన హరీష్‌కు వశిష్ట జూనియర్ కళాశాల స్పాన్సర్‌గా వ్యవహరిస్తుందని ప్రకటించారు. ఆసియా కబడ్డీ పోటీలో సత్తా చాటి భారత జట్టును గెలిపించాలని ఆకాంక్షించారు.కళాశాల చైర్మన్ మద్దుల కోటేశ్వరరావు,వైస్ న్రా శేషగిరిరావు, డైరెక్టర్లు నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివ నాగేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హరీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

విద్యుత్ కోతలతో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అనధికార కరెంటు కోతలతో పట్టణ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు నిత్యం గంటల తరబడి విద్యుత్ సరఫరా నిర్వహిస్తున్నాడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయం సందర్భం లేకుండా రాత్రి పగలను తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తుడటంతో విద్యుత్ శాఖ అధికారులపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన లేదా ఈదురు గాలులు వచ్చిన వెంటనే విద్యుత్ సరఫరాలు నిలిపివేస్తున్నారని ప్రజలు తెలుపుతున్నారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట నుండి ఉదయం 10 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది అధికారులను పలమార్లు ఫోన్ ద్వారా అడిగినప్పటికీ ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదని తెలుపుతున్నారు కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయటం లేదని తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ అధికారులను శుక్రవారం రాత్రి సమయంలో మహావీర్ నగర్ సబ్ స్టేషన్ సమీపంలో పిడుగులు పడడంతో లైన్లన్నీ కాలిపోయాయని మరొక లైన్ ద్వారా పట్టణంలో విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పుట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

విద్యార్థుల ఎదుగుదలకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విద్యార్థుల ఎదుగుదలకు క్రీడలు దోదపడతాయని డిఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరావు అన్నారు. పల్నాడు జిల్లా నరేష్ మెమో రియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ సుగాలీ కాలలోని జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జరిగాయి. ఈ టోర్నమెంట్ను డిఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరావు ప్రారంభించారు. టోర్నమెంట్‌లో 150 మంది క్రీడాకారులు 30 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. జట్లును మూడు గ్రూపులుగా విభజించి మ్యాచ్ నిర్వహించారు విజయవాడ, వర్సెస్ ఫిరంగిపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విజయవాడ జట్టు విజయం సాధించింది. కొర్రపాడు వర్సెస్ ఫిరంగిపురం పల్నాడు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఎం,డి.రియాజ్ ఆధ్వర్యంలో ప్రారంభిం చారు. జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో కొర్రపాడు జట్టు విజయ సాధించింది. నరేష్ ఫుట్‌బాల్ క్లబ్ వర్సెస్ ప్రకాశంఫుట్‌బాల్ క్లబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో నరేష్ ఫుట్‌బాల్ క్లబ్ జుట్టు విజయం సాధించింది. మధు సిసి మాదల వర్సెస్ సత్తెనపల్లి దరియా హుస్సేన్ జట్ల మధ్య జరిగిన మాచ్‌లో మాదల మధు సిసి జట్టు విజ సాధించింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెలినేడి రామస్వామి, గణేష్ ప్రాపర్టీస్ ఎండి పోతంశెట్టి వెంకటేష్, పురుషోత్తం నాయక్, రామకృష్ణ నాయక్ విద్యా కమిటీ వైస్ చైర్మన్ జెడ్ పి హెచ్, పల్నాడు జిల్లా ఏపీ ఎస్ఏపీఈ సెక్రటరీ షేక్.సుభాని, ఏ.శ్రీరామి రెడ్డి, ఎస్,అచ్చిరెడ్డి, షేక్ రన్ను హుస్సేన్, పి.శ్రీనివాసరావు, సుధారాణి, శేషయ్య, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం మహిళలు పెంచుకోవాలి

ఐద్వా గుంటూరు జిల్లా 12వ మహాసభలో రాష్ట్ర నాయకురాలు డి శ్రీనివాసకుమారి



మాట్లాడుతున్న డి శ్రీనివాసకుమారి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రశ్నించే తత్వం మహిళలు పెంచుకుని, సమాజ మార్పునకు కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి శ్రీనివాస్ కుమారి అన్నారు. శనివారం మంగళగిరి ఐద్వా కార్యాలయంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘ: (ఐద్వా) గుంటూరు జిల్లా 12వ మహాసభ జరిగింది. మహాసభకు అధ్యక్ష వర్గంగా పి పద్మ, ఎస్ గిరిజ, ఏ కళ్యాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఐద్వా జెండాను శ్రీనివాస కుమారి ఆవిష్కరించారు. మహిళా ఉద్యమంలో అమరులైన మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, మానుకొండ సూర్యవతి చిత్రపటాలకు పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. మహాసభలో శ్రీనివాసకుమారి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మహిళలు సమాజంలో శ్రమ దోపిడీకి గురవుతున్నారని, సంఘటితంగా ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళల అభ్యున్నత కోసం అనేకమంది సంఘసంస్కర్తలు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేయడం ద్వారా కొంతవరకు అభివృద్ధి జరిగిందని అన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై మహిళలు ప్రశ్నించేతత్వాన్ని పెంచు కోవాలని అన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి పురుషులు బానిసలు అవుతున్నారని, దీనికి అంతటికి ప్రభుత్వ విధానాల వలన జరుగుతున్నాయని అన్నారు. వీటిపై ప్రభుత్వంపై అందరితో కలిసి ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో సమాజ మార్పు కొరకు పనిచేసేటప్పుడు మహిళలు అనేక కష్టాలు ఎదుర్కొని పనిచేశారని అన్నారు. ఆడపిల్లలను రక్షించుకోవడానికి అనేక వర్గాల ప్రజలతో కలసి పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన 13గంటల పని దినాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ వేధింపులను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. మద్యాన్ని నిషేధించాలని అన్నారు. విద్యా వైద్యం ఉచితంగా ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించాలని కోరారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు పోతున్నప్పటికీ, సమాన పనికి


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

సమాన వేతనం ఇవ్వడం లేదని అన్నారు. మూఢ నమ్మకాలను వ్యతిరేకిస్తూ, బాల్య వివాహాలను నియంత్రించేందుకు మహిళలు కృషి చేయాలని కోరారు. మహిళలలో అక్షరాస్యత పెంచుకోవాలని, అందుకు పాలకులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలు అందరికీ అందించాలని కోరారు. ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి సంవత్సరానికి ఒకటి మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ షకీలబేగం మాట్లాడుతూ సమాజ పరిణామంలో స్త్రీ పాత్ర ఎంతో ఉందని అన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చేయడంలో కూడా స్త్రీ కీలకపాత్ర వహించిందని అన్నారు. రక్తహీనతతో బాధపడే మహిళలు ఎంతోమంది ఉన్నారని, వారిని ప్రభుత్వం గుర్తించి పౌష్టికాహారం అందించాలని కోరారు. సమాజ అభివృద్ధి కోసం మహిళలు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఉచిత బస్సు ఏర్పాటు చేసిన తర్వాత సోషల్ మీడియాలో మహిళలను వ్యంగ్యంగా మాట్లాడుతూ అనేక పోస్టులు పెడుతున్నారని విమర్శించారు. మహిళల హక్కుల కోసం నిరంతరం పని చేసేది ఐద్వా మాత్రమేనని అన్నారు. పని గంటల పేరుతో శ్రమ దోపిడీ చేయడానికి పాలకులు పనిగంటలను పెంచడం జరిగిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా మహిళలు సంఘటితమై ఉద్యమించాలని


మహాసభకు హాజరైన ప్రతినిధులు


జెండా ఆవిష్కరణ

పిలుపునిచ్చారు. జిల్లా మహాసభలు సందర్భంగా బాలికలు నృత్యం ప్రదర్శించారు. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. ఐద్వా గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు జరిగిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టి మాట్లాడారు. ఇంకా ఈ మహాసభలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జి రమణ, నాయకులు సిహెచ్ ప్రమీల, ఎస్ విజయలక్ష్మి, అధ్యక్షులు ఎం సంధ్యా, తాడేపల్లి పట్టణ అధ్యక్షురాలు డి విజయలక్ష్మి, సింహాద్రి సుమ పాల్గొన్నారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా కె.పద్మ, ఎల్.అరుణ


కె పద్మ, ఎల్ అరుణ

గుంటూరు జిల్లా ఐద్వా కమిటీ 16 మందితో ఎన్నికైంది. జిల్లా అధ్యక్షురాలుగా కే పద్మ, కార్యదర్శిగా ఎల్ అరుణ, సహాయ కార్య దర్శులుగా ఎస్ గిరిజ, ఎస్ సుమ, ఉపాధ్యక్షురాలుగా డి శ్రీనివాస్ కుమారి ఎన్నిక య్యారు. మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, పొదుపు గ్రూపులను బలోపేతం చేయాలని, మద్యం, మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేధించాలని, మహిళలపై జరుగుతున్న హింసపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మహాసభలో తీర్మానించారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం 16వ రాష్ట్ర మహాసభలు ఈనెల 13 వ తేదీ నుండి 15వ తేదీ వరకు అనంతపురం లో జరుగుతున్నాయి. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో గల ఐద్వా కార్యాలయంలో ఐద్వా రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారం కోసం కోసం నిరంతరం పనిచేసే ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, అధ్యక్షురాలు కేరళ మాజీ మంత్రి శ్రీమతి టీచర్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా ఉద్యమించాలి

ఎంటిఎంసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి

కార్మిక వర్గానికి నష్టం కలిగించే రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మున్సిపల్ కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. శనివారం రాత్రి మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఎం టి ఎం సి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ రెండవ మహాసభలో పాల్గొని ప్రసంగించారు. మహాసభకు సిఐటియు మంగళగిరి మండల రూరల్ నాయకులు యు దుర్గారావు అధ్యక్ష వహించారు. ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పడిన తర్వాత పారిశుధ్యకార్మికుల సమస్యలపై గత మూడు సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి విజయం సాధించామని అన్నారు. వేతనాల పెంపు కోసం ఉద్యమం చేసి సాధించామని అన్నారు. విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పోరాటం చేసి ఆప్కాస్‌లో చేర్పించడం జరిగిందని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉన్న హక్కులను కాలరాస్తూ చట్టాలు తీసుకురావడం జరుగుతుందని అన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటితంగా ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం రవి మాట్లాడుతూ 150 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల



మాట్లాడుతున్న ఎస్ ఎస్ చెంగయ్య

పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రూ.26 వేల వేతనం కోసం పోరాటం చేయాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని చెప్పి సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనెలు వాటి కోసం పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడుతుందని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ యూనియన్ మాజీ నాయకులు పి రామచంద్రరావు మాట్లాడుతూ 350 రూపాయల జీతం నుండి పోరాటం చేసి నేడు 21000 వేతనం తీసుకుంటున్నామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ వేతనాలు కూడా కార్మికులకు సరిపోవని ఇంకా వేతనాలు పెంపు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయడానికి మహా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. మహాసభలో ఎంటిఎంసి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ అధ్యక్షురాలు వి వెంగమ్మ, సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు, తాడేపల్లి రూరల్ సిఐటియు నాయకులు పి కృష్ణ, తదితరులు ప్రసంగించారు. అనంతరం 33 మందితో ఎంపీఎంసీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ కమిటీ ఎన్నికయింది. అధ్యక్ష కార్యదర్శులుగా సిహెచ్ పార్వతి, ఎస్ ఎస్ చెంగయ్య, ఉపాధ్యక్షులుగా వి వెంగమ్మ, ఎం వెంకటేశ్వరమ్మ, టి బాబు, ఎం డేవిడ్, బి. వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఎం రవి, కే శ్రీనివాసరావు, ఆర్ వేణు, వై శివ నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎం బాలాజీ ఎన్నికయ్యారు. తొలుత సిఐటియు జెండాను మున్సిపల్ ఎంప్లాయిూస్ యూనియన్ మాజీ నాయకులు పి రామచంద్రరావు ఆవిష్కరించారు.



ఎన్నికైన నూతన కమిటీ

పారిశుధ్య కార్మికులకు ఆగస్టు నెల జీతం జమ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల బ్యాంకు ఖాతాల్లో ఆగస్టు నెలకు సంబంధించిన జీతం సొమ్ము జమయ్యింది. రెండు నెలల జీతం చెల్లించాల్సి ఉండగా ఒక నెల జీతంతో ఏజెన్సీ నిర్వాహకులు సరిపెట్టి సెప్టెంబర్ నెల జీతం పెండింగ్ పెట్టారని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు రవి చెప్పారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, జీతాలు పెంచాలని కోరుతూ శుక్రవారం తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఏజెన్సీ, అధికారులు శుక్రవారం సాయంత్రానికి జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో పెండింగ్ జీతాలు ఒకేసారి చెల్లించాలని కోరినప్పటికీ శుక్రవారం రాత్రికి కార్మికుల అకౌంట్లో ఒక నెల జీతం మాత్రమే జమ చేశారని, సెప్టెంబర్ నెల జీతం కూడా వెంటనే కార్మికులకు చెల్లించేలా సిఆర్‌డిఎ అధికారులు చర్యలు చేపట్టాలని రవి కోరారు. ఆందోళన చేస్తేనే జీతం చెల్లించే పద్ధతిని ఏజెన్సీ మార్చుకోవాలని, సక్రమంగా జీతాన్ని చెల్లించా లని కోరారు. జీతాల కోసం పట్టుదలగా ఆందోళన చేసిన రాజ ధాని పారిశుధ్య కార్మికులకు సిఐటియు తరపున అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు కోసం

17న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ 17వ తేదీన మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామారావు మాట్లాడుతు ఎన్నికలకు ముందు మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, పట్టణాల్లో ఉన్న పేదలకు రెండు సెంట్లు స్థలం, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారని, ఈ మేరకు తాడేపల్లిలో శిలాఫలకాన్ని సైతం ఆవిష్కరిం చారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గతంలో కమ్యూనిస్టుల పోరాటం ఫలితంగా 40,000 మంది పేద కుటుంబాలు ప్రభుత్వ భూములు ఇల్లు వేసుకొని నివాసం ఉన్నా రని అన్నారు. వారిలో 20,000 మందికి పట్టాలు ఇవ్వడం జరిగి ందని అన్నారు. మరో 20 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంద ని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు సమస్యల పరిష్కారానికై 13, 14,15 తేదీలలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు, 17వ తేదీన ధర్నా కార్యక్రమానికి అర్జీలు తీసుకొని వందలాదిమంది తరలిరావాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు పి.బాలకృష్ణ, యు దుర్గారావు, పల్లె కృష్ణ, ఎం రవి, ఎస్ ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, జి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని : ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పేదలకు ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు ఇస్తానన్న వాగ్దానాన్ని నెరవేర్చక పోవడంతో సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద పేదలతో కలిసి ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలో శనివారం సుందరయ్య కాలనీలో ఇంటింటికి ప్రచారం గ్రూప్ సమావేశాలు నిర్వహించారు. పెదకాకాని సుందరయ్య కాలనీ,వడ్డెర కాలనీ,ఎస్టీ కాలనీ,జాన్ హేస్పర్ కాలనీ స్వర్ణ పూరి కాలనీ ఎన్టీఆర్ కాలనీ తదితర కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. 14వ తేదీ తాహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి బి బాబురావు. బి సాంబయ్య. కే రాఘవయ్య. ఏ నాగేశ్వరావు. షేక్ హసీనా. కె రమ్య ఎస్ మల్లేశ్వరి. ఆర్ వెంకటరమణ. సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి సేవలు అమూల్యం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి రెండు తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలు అమూల్యమైనవని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం ఓ ప్రకటనలో మీడియాకు వెల్లడించారు. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగా విస్తారమైనా, అప్రతి హతమైన ప్రజా సేవలు అందించినందుకు గానూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడి) సంస్థ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డ్ - 2025కు నారా భువనేశ్వరి ఎంపిక కావడం ఆడపడుచులకు ఎంతో గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా విశిష్ట వ్యక్తులకు మాత్రమే ఈ అవార్డు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయన భువనేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ

విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలని, లక్ష్య సాధనకు తమ ఇంజనీరింగ్ కళాశాల బాటలు వేస్తుందని తద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ అన్నారు. నరసరావుపేట మండలంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ ఏడాది ఇసిఇ విద్యార్థులకు విజయవాడకు చెందిన మైక్రోలింక్ పెరిఫెరల్ కంట్రోలర్ కంపెనీ ఆధ్వర్యంలో ఐఓటి అనే అంశంపై ఆరురోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారం ముగిసింది. రావెల సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పనే ధ్యేయంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ఫౌండర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవినారాయణ మాట్లాడుతూ ఆర్డినో ప్రోగ్రామింగ్ ఆటోమేషన్, బేసిక్ సెన్సార్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని అన్నారు. విద్యార్థులు వర్క్ షాప్‌లో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం వర్కుషాపులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతి నిధులు టి. గోవిందరావు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ జగదీష్, డాక్టర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఫాదర్, పాఠశాల ప్రిన్సిపల్

స్కూల్ గేమ్స్‌కు సెయింట్ జాన్స్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కారంపూడి

గురజాల డివిజన్ స్థాయిలో ఈనెల 17, 18న జరగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే క్రీడలకు మండల స్థాయిలో కారంపూడి పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుండి 18 మంది విద్యార్థులు అండర్ 14, 17కు ఎంపికయ్యారని స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ మర్రి అనిల్ కుమార్ తెలిపారు. వీరిని ఫాదర్, ప్రిన్సిపల్ బినోమ ప్రత్యేకంగా అభినందించారు. ఫాదర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు, గేమ్స్‌కి కూడా అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఎంతో ముందుకు తీసుకెళుతున్న సెయింట్ జాన్స్ హైస్కూల్‌కు మండలంలో ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లు ఆయన తెలిపారు. తమ స్కూల్ నుండి 18 మంది విద్యార్థులు ఎంపికవడం ఎంతో గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు నేనావత్. శివకృష్ణ నాయక్, నందినిని సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు



క్రోసూరులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ



యువతకు అవగాహన కల్పిస్తున్న సిఐ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - క్రోసూరు

మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందని క్రోసూరు ఎక్సైజ్ సిఐ టి.తులసి అన్నారు. శనివారం సాయంత్రం క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్లో మత్తు పదార్థాలకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉండాలని అన్నారు. మద్యం మాదక ద్రవ్యాల నుంచి నేటితరం యువతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థులు, యువకులు, సంఘసేవకులు, మేధావులు ముందుకు రావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఏ మార్గాల్లో వెళుతున్నారు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఈసందర్భంగా నాలుగు రోడ్ల సెంటర్ నుంచి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రదర్శించారు. ఎక్సైజ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల జరిగిన, జరగబోయే అనర్థాలను సోదాహరణంగా వివరించారు. పలువురు ఎక్సైజ్ సిబ్బంది గ్రామపెద్దలు యువజన సంఘాలవారు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి. విజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. సత్తెనపల్లి పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వలన అనర్థాలు గురించి విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వలన మానవ శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయని, కాలేయం, మెదడు, గుండె వంటి ప్రధాన అవయవాలు రోగగ్రస్తమవుతాయని, క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, వ్యంధత్వం, అల్సర్లు వస్తాయని వివరించారు. యువత, విద్యార్థులు మద్యానికి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా జీవితంలో ఉత్తమ లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. మద్యపానానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నాగలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్, నరసింహారావు, పోలీసులు ఖాజా, హనుమ, ఆనంద్, శివ పాల్గొన్నారు.

పంట మార్పిడి విధానం అవలంబించండి

జిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మల్లికార్జునరావు

ప్రజాశక్తి-ఈపూరు

ప్రతి రైతు పంట మార్పిడి విధానం అవలంబించాలని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని ఊడిజర్ల గ్రామంలో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో బేయర్, స్టేట్స్‌కేబి కంపెనీ బయో ఆర్గానిక్ ఉత్పత్తులపై మిర్చి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ ఒకే విధానమైన పంటలు పండించడం ద్వారా తెగుళ్ల అధికమై దిగుబడి తగ్గి పంట నాణ్యత కోల్పోయి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంట మార్పిడి విధానంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించడం ద్వారా పండే పంటలు విషపూరితంగా మారుతున్నాయన్నారు. విష పూరిత పంటలను తినటం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయన్నారు. పంట సాగు విధానంలో రైతులలో మార్పు రావాలని బయో ఆర్గానిక్ ప్రొడక్ట్స్ వినియోగించాలని సూచించారు. ఆర్గానిక్ పంటలకు మార్కెట్లో డిమాండ్ లభిస్తుందని వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగులో మార్పునకు కృషి చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏవో ఆర్ రామారావు,కంపెనీ ప్రతినిధులు రాజశేఖర్, మయూర్, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి మోహన్, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు,డీసీ చైర్మన్ జి.వేణుగోపాలరావు, సర్పంచ్ జి. శ్రీనివాసరావు, పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సిహెచ్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

'కోటి సంతకాల ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరులో వైసిపి కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను శనివారం పెదకూరపాడు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు చేపట్టే వైసిపి కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని శంకరరావు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి సంతకాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు లైఫ్ స్కిల్స్‌పై శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధ్యాయులు నిత్యం తమలో చైతన్యం నింపుకుని బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ పి.వెంకట్ సూచించారు. నరసరావుపేట పట్టణ సమీపంలో చిలకలూరిపేట రోడ్డులోని ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులకు సిబిఎస్ఇ చే లైఫ్ స్కిల్స్ అనే అంశంపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. చైర్మన్ వెంకట్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతుల వల్ల ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు మరింతగా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల వైస్ చైర్మన్ పల్లబోతుల మురళి బాబు అమెరికా నుండి వర్చువల్‌గా మాట్లాడుతూ మెరుగైన బోధన అంశాల ద్వారా విద్యార్థుల సామర్థ్యం మెరుగుపడుతుందనీ, వారి శ్రేయస్సు దృష్ట్యా ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా మని తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ఒంగోలు క్విస్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు చేయాలని మేథో వికాసం శక్తి పెంపొందించి సమాజం పట్ల, జీవితం పట్ల సరైన అవగాహనతో మెలిగేలా తీర్చి దిద్దాలన్నారు. గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ ప్రిన్సిపాల్ డి.సుధా మాధవి, ప్రిన్సి పాల్ దివిశేషసాయి, వైస్‌ప్రిన్సిపాల్ ఎండ్లూరి చంద్రబాబు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది విశ్వనాథ్, సాయిబాబా, సాయి, సిబ్బంది పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో సుధీర్ భార్గవ్ రెడ్డి, నాయకులు

డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి వైఎస్ఆర్ సిపి సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి జన్మదిన వేడుకలు సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ గజ్జల సుధీర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరివర్తన అనాథ శరణాలయంలో మానసిక వికలాంగ విద్యార్థులకు అన్నదానం చేశారు. రిఫ్రిజిరేటర్ బహూకరించారు. అనంతరం మొల్లమాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు.



మాట్లాడుతున్న శరత్‌చంద్ర

ఏపీఆర్‌డిసిలో కెరియర్ గైడెన్స్ కార్యక్రమం

ప్రజాశక్తి - విజయపురి సౌత్

విజయపురి సౌత్ ఏపిఆర్‌డిసి కళాశాలలో కెరియర్ గైడెన్స్ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా పూర్వ విద్యార్థి శరత్‌చంద్ర ఐపీఎస్, అకాడమీ ఫ్యాకల్టీ హెడ్ శివకుమార్ పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠ్యాంశాల పట్ల అవగాహన, పూర్వ ప్రశ్నపత్రాలు సమీక్ష, నిశ్చితత్వం, ప్రణాళిక, నిరంతర అభ్యాసం, పరిసరాల స్వచ్ఛత, శుభ్రత మానసిక ఆరోగ్యం, సరైన సాహచర్యం, సానుకూల దృక్పథం, పోటీ పరీక్షలలో విజయంసాధించ డానికి ప్రాథమిక సూత్రాలని, ఉన్నతమైన వ్యక్తిత్వంతో ఉత్తమ జీవితాన్ని సాధించుకోవచ్చని విద్యార్థులకు ప్రేరణ దాయకంగా వివరించారు. తెలంగాణ పోలీస్ డిపార్టుమెంటు ఉద్యోగి, కళాశాల పూర్వ విద్యార్థి నరసింహారావు పోలీసు వ్యవస్థలోకి ప్రవేశించాలంటే, ఏ విధంగా సన్నద్ధం అవ్వాలో, విధి విధానాలను, పరీక్ష విషయాలను విద్యార్థులకు వివరించారు. గురజాల మోడల్ జూనియర్ కాలేజీలో పొలిటికల్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న సాంబశివరావు, డిగ్రీ విద్యతో ఉన్న అపార ఉద్యోగ అవకాశాలను, విద్యారం గంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలను ఆసక్తిదాయకంగా విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ నయీం భాను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్,డాక్టర్.ఎస్.కె.మహమ్మద్‌బాషా పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి దేశానికి అవమానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై చెప్పు విసిరిన మతోన్మాద న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సత్తెనపల్లి నియోజకవర్గ అంబేద్కర్ ప్రజాసంఘం అధ్యక్షులు దావులూరి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో న్యాయ వ్యవస్థపైనే దాడి జరగటం సిగ్గు చేటు అని పేర్కొన్నారు. మతోన్మాది కిషోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఘనంగా మేకల రవీంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు పుట్టినరోజు వేడుకలు స్థానిక జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు రవీంద్రబాబుతో కేక్‌ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రబాబు అంకితభావంతో పని చేస్తున్నారని, చిరంజీవి మార్గదర్శకత్వంలో అనేక సేవా కార్యక్రమాలు, సామాజిక ఉద్యమాలు చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రవీంద్రబాబును జనసేన కార్యకర్తలు, చిరంజీవి అభిమానులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గిడుతూరి సత్యం, శిఖా బాలు, చుండూరు రామకృష్ణ, నాగరాజు, మొఖమాటం రమేష్, నల్లచెరువు, సంగడిగుంట, నెహ్రూనగర్ తదితర ప్రాంతంలా అభిమానులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లి

సమస్యలు పరిష్కరించాలని వృత్తిదారులు శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక చిట్యాల ఐలమ్మ రజక కళ్యాణ మండపంలో వృత్తిదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలు, రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని, రజక అభివృద్ధి - సంక్షేమ కార్పోరేషన్ ద్వారా బడ్జెట్లో కేటాయించిన నిధులను రజకుల అభివృద్ధికి ఖర్చు చేస్తామని, ఆదరణ 3 పథకం ద్వారా రజకులకు ఆధునిక పనిముట్లు అందజేస్తామని, 50 సంవత్సరాలు వయసు పూర్తయిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాల చేపడతామన్నారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ కమ్ ఇస్త్రీదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు , మాచవరం నరసింహారావు, కొండాయ గుంటయానాదిరావు, మండూరి బాబురావు, తాడేపల్లి సాంబశివరావు, ధరణికోట వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు చేతి రాత శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ లో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప ఆధ్వర్యంలో శనివరాం చేతి రాత శిక్షణ శిబిరం జరిగింది. ఎనిమిదవ తరగతి నుండి ఇంటర్ వరకు సుమారు 70 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొని చేతి రాత సాధన చేశారు. ప్రసిద్ధ కాలిగ్రాఫర్స్ షేక్ జున్ను సర్, ముజార్స్ బుర్హాన్ ప్రధాన శిక్షకులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ చేతిరాత మన వ్యక్తిత్వానికి అద్దం వంటిది అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకులు ఎం.రామచంద్రారెడ్డి, హిందీ ఉపాధ్యాయులు అనిలా సుల్తానా, బిఎస్ఎల్ రాజు తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

అన్నపర్రు విద్యార్థులకు కలెక్టర్ పరామర్శ

జిజిహెచ్ రోగులను పరిశీలించిన తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పెదనందిపాడు మండలం అనపర్రు బిసి వసతి గృహంలో కలుషిత ఆహారంతో అస్వస్తతకు గురైన విద్యార్థులను జిల్లా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శనివారం మరోసారి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి పర్యవేక్షకులు రమణ తెలియజేశారు. విద్యార్థులకు, అత్యవసర చికిత్సల కోసం వచ్చే ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించుటకు వైద్యులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని రకాల మందులు అందు బాటులో ఉండాలని వివిధ విభాగాల్లో మరమ్మతులకు గురైన పరికరాలు ఉంటే వాటిని కూడా ఉపయోగంలోకి తీసుకుని రావాలని అన్నారు. అలాగే వివిధ వార్డులోని రోగులను కూడా ఆమె పరిశీలించారు.వారికి అందుతున్న చికిత్సలను పరిశీలించారు. అనపర్రు వసతిగహంలో విద్యార్థులందరూ ఆరోగ్యంగానే ఉన్నారని జిల్లా సాంఘిక, బీసీ సంక్షేమ అధికారి చెన్నయ్య తెలిపారు. జిల్లాలో ఉన్న 33 వసతిగృహాలకు గాను, 24 వసతిగృహాల్లో ఇప్పటికే నీటి నమూనా పరీక్షలు నిర్వహించామని చెప్పారు. మిగిలిన వసతి గృహాల్లో సైతం నీటి నమూనా పరీక్షలు పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అన్ని వసతి గృహాల్లో నీటి తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడం జరిగిందని ఆయన వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఇతర అధికారులు అనపర్రు గ్రామాల్లో పరుగు పర్యటించి అచ్చట పారిశుధ్యం, తాగునీటి పరిస్థితులు పరిశీలించారు.

సీఎం అనుయాములకు లబ్ధి చేకూర్చేందుకే పీపీపీ

ప్రజాశక్తి- తాడేపల్లి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సిపి నాయకులు

ముఖ్యమంత్రి గొప్పగా చెబుతున్న పీపీపీ వల్ల తన అనుయాయులకు లబ్ది చేకూర్చాలన్నదే చంద్రబాబు ఆలోచన అని వైఎస్ఆర్‌సిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుండి 45 రోజులకు పైగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్ఆర్‌సిపి ప్రజా ఉద్యమం చేపట్టి గవర్నర్ దృష్టికి తీసుకెళ్తుం దని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని, అందులో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి చేశారని, మరో మూడు తుదిదశకు చేరుకున్నాయని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు అమర నాగయ్య,పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండలలోని వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వీటీజేఎం, ఐవీటీఆర్ కళాశాల సెక్రటరీగా డీవీ నరసింహం

ప్రజాశక్తి - మంగళగిరి



డి.వి.నరసింహం

మంగళగిరిలో ప్రముఖ విద్యాసంస్థ అయిన వీటీజేఎం, ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలకు సెక్రటరీ, కరస్పాండెంట్‌గా దామర్ల వెంకట నరసింహం నియమితులయ్యారు. ఈ నెల 6వ తేదీ జరిగిన కళాశాల కమిటీ గవర్నింగ్ బాడీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఇసునూరి చంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింహం ఉన్నత విద్యావంతుడు. హైకోర్టు న్యాయవాది. మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కమిటీ సభ్యులుగానూ ఉన్నారు. వీరు గతంలో ప్రముఖ దినపత్రిక ఈనాడు తాడేపల్లి విలేకరిగాను, కొంతకాలం ఆంధ్రప్రభ దినపత్రికలోనూ రిపోర్టర్‌గా సామాజికపరంగా సమర్ధవంతమైన సేవలందించారు. నరసింహం తండ్రి వారసత్వంగా మంగళగిరి పాతబస్టాండ్ సెంటర్లో డీఎస్ రంగనాయకులు అండ్ కో (అడ్వకేట్స్, ఆడిటర్స్) సంస్థను విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. వీటీజేఎం, ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలకు డీన్‌గా ఉన్న నరసింహం కీలకమైన సెక్రటరీ, కరస్పాండెంట్ బాధ్యతలను చేపట్టారు.





యార్డులో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న సభ్యులు

ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

వ్యవసాయంతో పాటు వ్యవసాయ రంగ అనుబంధ సంస్థలను బలోపేతం చేసి రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యాడ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీ అన్నారు. శనివారం జరిగిన ప్రధాని పథకాల శిల న్యాసం ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న పాడి, మత్స్య, కోళ్ల పరిశ్రమలతో పాటు 1100 రకాల పథకాలను 42 వేల కోట్ల రూపాయలతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యార్డ్ సెక్రటరీ జెవి సుబ్బారావు మాట్లాడుతూ దేశం ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ 2.0 జీఎస్టీ ద్వారా రైతులు వ్యాపారస్తులు ప్రజల అందరికీ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం పీఎం దన్ ధాన్య కృషి యోజన, దళహన్ ఆత్మ నిర్భర్ మిషన్ పథకాలను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాల అమలుతో వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో యాడ్ డిప్యూటీ చైర్మన్ ఎస్ రవి కిషోర్ మరియు యాడ్ సిబ్బంది రైతులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు

312వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సి బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 312 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, షేక్ సుభాని, వై.సాంబశివరావు, ఎం.గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో టి.కె.ఎన్.మోహనరావు, హేమంత్, దర్శి బేబమ్మ, కె.ఏడుకొండలు, కొప్పుల అంకమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో మొలక శారదా, దేరంగుల రమణమ్మ, శివకుమారి, ఎస్.కె.ఇమాంబి, ఈ.శరమ్మా, వి.రిబ్కా, డి.నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సిఎంఆర్ ఎఫ్ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శనివారం అందచేశారు. 12వ వార్డుకి చెందిన షేక్ పూరు మహిరాకి, 17వ వార్డుకి చెందిన ఉయ్యాల లక్ష్మికి, 9వ వార్డుకి చెందిన సువ్వడి చిన్నమ్మకి చెక్కులను వెంకట్రావు అందచేశారు. సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ ఓలేటి రాము, ఇట్టా భాస్కర్, షేక్ చాంద్ బాషా, సిహెచ్.రాంబాబు, సంజీవరెడ్డి, సైకం సాంబయ్య, దర్శి హరికృష్ణ, తాడిబోయిన గోపి, కొర్రపాటి విజయ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు జరిగాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. పాముల రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశీయ ఫార్మా సంస్థ అయినటువంటి 'దివీస్ కంపెనీ' వారు తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫార్మసీ కళాశాలల నుండి మొత్తం 30 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వివిధ వడపోత పరీక్షల అనంతరం ముఖాముఖి ఇంటర్వ్యూలకు డీ.ఫార్మసీ, ఎం.ఎస్సీ, డీ.టి.కె., పదవ తరగతి, ఐ.టి.ఐ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఎంపికైన వారికి వారం రోజులలో నియామక పత్రాలు అందుతాయని దివాన్ కంపెనీ ప్రతినిధి డి. శ్రీహరి తెలిపారు. విద్యార్థులను సెక్రటరీ సిస్టర్ బి. నిర్మల జ్యోతి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధి కల్పనాధికారి ఎం. ప్రశాంతి, సమన్వయకర్తలు వి. జోజి బాయి, సిహెచ్ భార్గవ్ గోపి, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిపి సరిత

సవాళ్లను స్థితప్రజ్ఞతతో ఎదుర్కోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును స్థిత ప్రజ్ఞతతో ఎదుర్కొన్నప్పుడే ఆనందకరమైన జీవితం మీ సొంతమవుతుందని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ డిసిపి సరిత అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భాష్యం సమత మమత క్యాంపస్‌లో జరిగిన భాష్యం స్పార్క్స్ హర్ సమ్మిట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సరిత మాట్లాడుతూ మొదట మీ జీవితంలో మీ లక్ష్యం ఏమిటో గుర్తించాలన్నారు. నేటి ప్రపంచంలో మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న అకృత్యాలు, నేరాల పట్ల జాగరుకతతో వ్యవహరించాలని విద్యార్థినులకు సూచించారు. మీరు కలలు కన్న ప్రపంచాన్ని మీరే సృష్టించుకోవాలన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ అనాదిగా మహిళల పట్ల సమాజంలో నెలకొన్న వివక్షత దక్పథం మారాలన్నారు. మన జీవితానికి హాని కలిగించే సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో లక్ష్యసాధన కోసం కషి చేయాలన్నారు. ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ మొదట మహిళకు గౌరవం ఇంటి నుండే మొదలవ్వాలని అన్నారు. అప్పుడే ఈ వివక్ష సమాజం నుండి దూరమవుతుందన్నారు. సి.ఎస్.బి ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ ఈ లోకంలో మహిళా శక్తి ఎంతో అద్భుతమైనదని, సంకల్ప బలంతో అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేయగలరన్నారు. ముందుగా అంతర్జాతీయ, జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన భాష్యం విద్యార్థినులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికల అందజేశారు. అనంతరం వివిధ కార్యక్రమాలకు చెందిన లోగోలన ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న శేషాచలం

విజ్ఞాన్ యూనివర్సిటీలో 5జీ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన 5జీ ల్యాబ్, గ్లోబల్ డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ ల్యాబ్‌ను బీఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఏ.రాబర్ట్ జె.రవి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5జీ ల్యాబ్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు 5జీ సాంకేతికతలలో నైపుణ్యాలను అభివద్ధి చేసుకోవడమే కాకుండా, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, స్మార్ట్ సిటీస్, లాజిస్టిక్స్, ఈ-గవర్నెన్స్ వంటి కీలక రంగాలలో నవీన ఆవిష్కరణలు, అనువర్తనాలను అభివద్ధి చేసే దిశగా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. ల్యాబ్‌లో పూర్తిస్థాయి 5జీ స్టాండలోన్ సెటప్ ఏర్పాటు చేయబడిందని, ఇందులో 5జీ సిమ్‌లు, డాంగిల్స్, ఐవోటీ గేట్‌వేలు, రౌటర్లు, అప్లికేషన్ సర్వర్లు మొదలైన పరికరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇవి విద్యార్థులు, పరిశోధకులు ప్రయోగాలు చేయడానికి, పరిశోధన నిర్వహించడానికి లైవ్ 5జీ వాతావరణం అందిస్తాయన్నారు. బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం మాట్లాడుతూ 5జీ ల్యాబ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యార్థులు రియల్‌టైమ్‌లో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని అన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికతలలో ముందంజలో ఉండేందుకు ఈ 5జీ ల్యాబ్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. 'ఇది పరిశోధన, ఆవిష్కరణ, పరిశ్రమ-విద్యా భాగస్వామ్యానికి కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, వైస్ చైర్మన్ లావు రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవి.రావు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

7 వీక్షణం

జిల్లాల పునర్విభజన తరువాత కూడా చిన్న జిల్లాలకు పెద్ద అధికారులు ఉన్నా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసే వారు కరువయ్యారు. మొక్కుబడి సమీక్షలు, విఐపి పర్యటనలతో కాలక్షేపం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏం ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించే నాథుడు కరువయ్యారు. ఒక్క పెద్ద సంఘటన జరిగితే తప్ప యంత్రాంగం మొత్తం కదిలి వెళ్లే పరిస్థితి లేదు. క్షేత్రస్థాయిలో వివిధ హోదాల్లో పనిచేసే వారు వారి రోజు వారి విధి నిర్వహణ సరిగా చేస్తున్నారా లేదా అన్న విషయం ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం సంక్షేమ వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థలు తదితర అంశాల్లో విద్యా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. సురక్షితమైన తాగునీరు, మెరుగైన శానిటేషన్ అందించడంలో అధికార యంత్రాంగం తరచూ విమర్శలకు గురవుతోంది. తురకపాలెం ఘటన తరువాత గుంటూరులో పెద్ద ఎత్తున డయేరియా ప్రభలింది. మరణాలు లేకపోయినా దాదాపు 200 మందికిపైగా ప్రజలు డయేరియా బారిన పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. వందలాది మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. సొంతంగా మరికొంత మంది వైద్యం పొందారు. ఇలా నీటి కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే క్షేత్రస్థాయి యంత్రాంగం పని తీరును మెరుగుపర్చడంలో అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేకపోతోంది. గుంటూరుకు అతి సమీపంలోఉన్న తురకపాలెంలో గత రెండు నెలలుగా సంభవిస్తున్న అసాధారణ మరణాలపై ఇంత వరకు కారణం కనుగొనలేదు. ఎవరికి వారు తమ శాఖ తప్పు లేదంటే తమ శాఖ తప్పు లేదని చేతులు దులుపుకున్నారే తప్ప రెండు నెలల కాలంలో 28 మంది మృతి చెందినా ఇప్పటికీ స్పష్టమైన కారణాలు వెల్లడి కాలేదు. గ్రామంలో ఇప్పటికీ జ్వరపీడితులు వస్తూనే ఉన్నారు. అలాగే పెదనందిపాడు మండలం అనపర్రులో బిసి సంక్షేమ వసతి గృహంలో 106 మంది విద్యార్థులు ఉండగా 65 మంది వరకు కలుషిత ఆహారం తిని అస్వస్తతకు గురయ్యారు. ఈ వసతి గృహంలో సిబ్బంది పనితీరు వివాదాస్పందంగా మారింది. వార్డెన్, కుక్, సమీప పాఠశాల సిబ్బంది తమను వేధిస్తున్నారని, నాణ్యమైన ఆహారం పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. సంక్షేమ శాఖ అధికారులు పట్టిపట్టన్నట్టు వ్యవహరిస్తున్నారు. 65 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి అయితే జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించే వరకు క్షేత్రస్థాయి యంత్రాంగం స్పందించలేదు. గ్రామస్తులు కూడా విద్యార్థుల ప్రాణాలను కాపాడటంలో బాగా కృషి చేశారు. బిసి వసతి గృహంలో దుర్భమైన పరిస్థితులు నెలకొన్నాయి. శానిటేషన్ సరిగా లేదు. పరిశుభ్రత కొరవడింది. సురక్షితమైన తాగునీటి సరఫరా జరగడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. జిల్లాలో అన్ని వసతి గృహాలలో పరిస్థితులు దుర్భరంగా ఉన్నా ఏదైనా సమస్య వస్తేనే సంబంధిత అధికారులు దృష్టి పెట్టడం, మిగతా సమయాల్లో తమ బాధ్యతలను విస్మరించడం పరిపాటిగా మారింది. జిల్లాలో భారీ వర్షాల వల్ల వ్యాధులు ప్రభలుతున్నా వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో రహదారులపై రోజుల తరబడి మురుగునీరు పారుతున్నా జిల్లా అధికారులు పరిశీలన చేయడం లేదు. పిహెచ్‌సిల్లో వైద్యులు, సిబ్బంది ఉంటున్నారా, ప్రజలకు వైద్య సదుపాయాలు అందుతున్నాయా లేదో పట్టించుకోవడం లేదు. ఒకే సారి ఎక్కువ మంది డయేరియా, కలరా వంటి వ్యాధుల బారినపడితే యంత్రాంగం స్పందిస్తుంది తప్ప ముందస్తు నివారణ చర్యలపై ఎవరికి వారు ఇది తమ బాధ్యత కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కేవలం అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపం వల్లే తురకపాలెంలో అసాధారణ మరణాలు సంభవించాయని ప్రభుత్వం గుర్తించినా ఇంత వరకు ఎవరిపైనా చర్యలు లేవు.

(ఎ.వి.డి.శర్మ)

కిట్స్‌లో ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో 2025-2026 విద్యాసంవత్సరానికి చెందిన మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకలను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని, పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కిట్స్‌లో వీటికి మరింత ఎక్కువ ప్రాధాన్యతని కోసం వివిధ కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఉండాలని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కేవలం ఉపాధి కోసమే కాకుండా, స్వశక్తితో పారిశ్రామిక వేత్తలుగా మారేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పిజిఎస్ లేని బస్ ట్రాకర్ అప్లికేషన్‌ని ఆవిష్కరించారు. కళాశాల కార్యదర్శి కోయిశేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణ అవలంభిస్తూ లక్ష్యం దిశగా కృషి చేస్తూ తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేసేలా విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, వివిధ విభాగాధిపతులు మాట్లాడారు. ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక కోలాహలంగా మారింది.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

మలినేనిలో ముగిసిన హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు : మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల రెండ్రోజులపాటు విద్యార్థులకు ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఏజెంటిక్ ఎఐపై 36 గంటల హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఈ ఇంటెన్సివ్ హ్యాకథాన్‌లో విద్యార్థినులు ఏజెంటిక్ ఎఐ రంగంలో సృజనాత్మక సమస్యలను పరిష్కరించేందుకు నమూనాలు రూపొందించారు. 36 గంటలపాటు, టెక్నికల్ సవాళ్లు, కోడింగ్, మోడల్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మలినేని సంస్థల ఛైర్మన్ డాక్టర్ పెరుమాళ్లమాట్లాడుతు 'ఇలాంటి హాకథాన్‌లు విద్యార్థుల సజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, టీంవర్క్ పెంపొందించడంలో కీలకంగా ఉంటాయన్నారు. ఆధునిక ఎఐ రంగంలో ప్రాక్టికల్ అనుభవం కోసం ఇది గొప్ప అవకాశం అని అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి హ్యాకథాన్‌లు విద్యార్థినుల భవిష్యత్‌ను మరింత ఉజ్వలంగా ఉండేవిధంగా చేస్తాయన్నారు. ఈప్రోగ్రాంలో జ్యూరీ సభ్యులుగా ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దివాన్, సాప్ ఇండియా మనీష్ గుప్త, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ రియల్ పేజీ డైరెక్టర్ అవ్నీష్ భట్నాగర్, ఏంజెల్ ఐస్ సీఈవో డాక్టర్ కె.ఎస్ హిమబిందు పాల్గొని ప్రాజెక్టులను పరిశీలించి 5 జట్లను విజేతలుగా ప్రకటించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, సిఎస్ఈ-ఎఐ అండ్ ఎంఎల్ హెచ్ఒడా డాక్టర్ డి.రవికిరణ్, ఎఐ అండ్ డిఎస్ హెచ్ఒడి డాక్టర్ ఎన్.చార్లెస్ జయరావు, తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులు

శారదానికేతన్ బలోపేతానికి సమిష్టి కృషి జరగాలి

నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీశారదానికేతనము కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, ఆదిశగా వసతుల కల్పనకు సమిష్టి కృషి జరపాల్సిన అవసరం ఉందని నర్సరావుపేట లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. శనివారం బ్రాడీపేటలోని శ్రీశారదానికేతనం అదనపు తరగతి గదుల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం వంద సంవత్సరాల క్రితమే ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ కషి చేశారని, అందులో భాగంగా బాలికల విద్యకోసం 1922లోనే శారదానికేతనం నెలకొల్పి వసతి, భోజన సదుపాయన్ని కల్పించటం చారిత్రక కర్తవ్యంగా పేర్కొన్నారు. వితంతవుల పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ ఉన్నవ దంపతులు స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శారదానికేతనమును మరింత అభివృద్ధి పరిచేందుకు దాతలు సహృదయంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు.


మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవం రోజున శారదానికేతనములో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందదాయకం అన్నారు. మహిళలకు సరైన అవకాశాలు కల్పించి సమానత్వం వైపు కృషి జరగాలన్నారు. వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ అనేక మంది దాతల పాఠశాల అభివృద్ధికి వివిధ రూపాల్లో తోడ్పడ్డారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1902లో కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో ఉన్నవ దంపతులు గుంటూరులో వితంతు వివాహం జరిపించారని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్ళి నాటి దళితుల, బలహీన వర్గాల స్థితిగతులను ప్రతిబింబిస్తూ మాలపల్లి నవలను ఉన్నవ లక్ష్మీనారాయణ రచించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ తదితరులు ప్రసంగించారు. మొదట ఉన్నవ దంపతుల చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. లయన్స్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీరప్రకాష్ నేతత్వంలో సభ నిర్వహించగా శర్వాణి రెడీమిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాలరెడ్డి, జెకెసి కాలేజి సెక్రెటరీ జాగర్లమూడి మురళీ మోహన్, కార్మెల్ సేవాసదన్ వ్యవస్థాపకులు జాక్ క్షమాకస్, మానవత చైర్మన్ పావులూరి రమేష్, హెచ్ఎం ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.